ఆయన గూడ సంప్రదాయాలు పాటిచ్చేటోళ్లే తనకు ప్రీతి అంటడు గదా!? ఈ అల్లా ప్రీతి ఏందో ఏమో? మరి అమ్మను అక్కడ గూడ ఆయన వేధిస్తున్నడేమో తెల్వది? అయినా.. నేను గవన్నీ నమ్మ. అమ్మకు న్యాయం చెయ్యాలని ఒట్టుతోని నేనిక్కడికచ్చిన'' అంటూ ఖలీల్ భారంగా నిట్టూర్చాడు. తన శ్వాసలో రాళ్లు అడ్డం పడుతున్నట్టు అనిపించింది.

ఇదంతా వార్తల్లో వచ్చినా.. తను ఎవరినుంచైతే న్యాయాన్ని కోరుకుంటున్నాడో.. వాళ్లెవరూ అటువైపు రావట్లేదు. కానీ, ఖలీల్‌కు కాల్స్, వాట్సాప్ మెసేజులు పంపిస్తూ బెదిరిస్తున్నారు.

''మామా.. వాళ్లు చానా డేంజర్ గాళ్లున్నరు. ఫేమస్ అవుతవ్‌గనీ.. న్యాయం జరుగుతదని అనిపిస్తలేదు'' భయంగా అన్నాడు సంతోష్.

ఆ మాటలు విన్న ఖలీల్ పెదాలమీద ఓ వైరాగ్యపు నవ్వు. ఆ నవ్వులో.. వెన్ను చూపేదే లేదని.. తన ప్రాణం అడ్డు పెట్టయినా ఏదో ఒకటి తేల్చుకోనిదే ఈ నల్గొండ నుంచి వెనకడుగు వేసేదేలేదని స్పష్టంగా కనిపిస్తున్నది.

దృఢమైన ఆత్మవిశ్వాసం అతని ఊపిరిలో ఉఛ్వాసని శ్వాసమవుతున్నది.

కుదురుగా ఉన్న తమ కూసాలు కదిలిపోతున్నాయి. ఇన్నాళ్లు ఎవరికీ తెలియని చేదునిజం ఇవ్వాళ్ల అందరికీ తెలిసి తమ పరువంతా పోతున్నది.. అనుకొని కనీజ్, రియాజ్, ఫైజాన్ మరికొందరు మనుషులతో రాత్రిపూట అక్కడికొచ్చారు.

''కుచ్ దీన్ కే బారేమే మాలుమాత్ హువాతో యే షైతానీ చాల్ నై కర్తేరే తుమ్ లోగాం''..

కనీస్ మాటలు ఖలీల్ రక్తాన్ని మరింత ఉడికించాయి. గడ్డం పెంచిన వాళ్ల నుదుర్ల మీద నల్లని మచ్చలున్నాయి. ఐదు పూటలా నమాజ్ చదువుతారు. కానీ, ఖలీల్ వాళ్లకు పూర్తి వ్యతిరేకంగా ప్యాంటు, షర్టులో ఎలాంటి గడ్డం, మచ్చలేకుండా ఉన్నాడు.

వాళ్లనుంచి అవే సాంప్రదాయిక చీదరింపులు. మానవత్వం కోసం దీన్ కావాలా? దీన్ మానవత్వాన్నే కదా బోధిస్తున్నది? ఈ అణచివేతకు అంతులేదా? దీన్ వాళ్ల దానవత్వాన్ని యాక్సెప్ట్ చేస్తుందా? నిరంకుశత్వానికి సహకరిస్తుందా? మాకింత అన్యాయం చేసి వాళ్లు హజ్ యాత్ర చేసి రావడం కుబూలా? అసలిదంతా ఆ పైవాడు చూస్తున్నాడా? చూస్తూ మౌనం నటిస్తున్నాడా?

ఖలీల్ మనసులో ప్రశ్నలు?

నిరసన మానకుంటే చంపేస్తామన్నారు. అయినా ఖలీల్ బెదరలేదు. నిండా అమ్మ ఉన్న ఆ గుండెను మరింత నిబ్బరం చేసుకున్నాడు.

అయితే ఫీల్‌ఖానాలో ఉన్న కొంతమంది పరోక్షంగా ఖలీల్‌కు మద్దతు తెలుపుతున్నారు. కనీజ్ తన పలుకుబడిని ఉపయోగించి ఎమ్మెల్యే, ఎంపీలతో చివరికి రౌడీలతో కూడా బెదిరించాడు.

అయినా ఖలీల్ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో వెనకడుగేసే ప్రసక్తే లేదనుకున్నాడు. ఎందుకంటే ఈ విషయం మీద తనకు సోషల్ మీడియాలో, ప్రత్యక్షంగా, పరోక్షంగా లభిస్తున్న మద్దతే కారణం.

* * *

ఈ క్రమంలో అడగకున్నా వరాలిచ్చే దేవదూతలాగా శాంతి అనే అడ్వకేట్ వచ్చింది. తన అస్తిత్వ పోరాటంలో చేయూతనిచ్చింది. ముప్పై ఏళ్ల క్రితం తాహేరాబేగం దిగువ కోర్టు ప్రొసీడింగ్స్‌లో కావాలని గైర్హాజరు అయినట్లుగా చిత్రీకరించి.. ఆమె కేసును నీరుగార్చిన తీరును గమనించింది. ఆ కేసును రీటేక్ చేసి హైదరాబాద్లోని హైకోర్ట్‌లో వాళ్ల అమ్మ తరుపున అప్పీల్ వేసింది.

కోర్టు తీర్పు వచ్చేవరకు తన శాంతియుత నిరసన అక్కడే కొనసాగుతుందన్నాడు ఖలీల్.

అప్పీల్ వేయడంలో ఆలస్యాన్ని మన్నించమని, దిగువ కోర్టు కళ్లకు గంతలు కట్టి మోసపూరితంగా కేసును రద్దు చేయించిన తీరును హైకోర్టు గమనించాలని ఆధారాలతో ప్రార్థించింది శాంతి.

చివరికి శాంతి శ్రమ ఫలించింది. తాహేరాబేగం, ఖయ్యూం నిఖానామాను హైకోర్టు సరైనదిగా గుర్తించింది.

''భౌతికంగా లేని తాహేరాబేగంను.. ఖయ్యూం రెండో భార్యగా కోర్టు గుర్తిస్తున్నది. వారి నిఖా చట్టబద్ధంగానే జరిగింది'' అంటూ తీర్పిచ్చింది.

ఆ తీర్పును విన్నాక మందంగా, పటిష్ఠంగా ఉన్న మౌనమైన గోడను ఒక్కపెట్టున గుద్ది బద్దలు చేసినంత సంబురమైంది ఖలీల్‌కు! సమాధైన సత్యం లేచి ఊపిరి పీల్చుకున్నట్టయ్యింది!!

ఆకాశానికి అశ్రులుజాచి, ఆర్ద్రంగా చూస్తూ..

''అమ్మీ నువ్వు ఖయ్యూంసాబ్ భార్యవే. నీకు న్యాయం జరిగిందమ్మీ'' అన్నాడు ఆకాశానికి చిల్లులు పడేంత గట్టిగా గర్జిస్తూ.

తండ్రి ఆస్తుల కోసం కేసు వేద్దామన్న శాంతి గారి సలహాను సున్నితంగా తిరస్కరించాడు ఖలీల్.

''మాకు ఆస్తులు ఏమద్దు. నా జన్మ సార్థకం చేసుకున్నా. కోర్టు అమ్మను ఖయ్యూం సాబ్ భార్య అన్నది గదా! ఇగ మా అమ్మీ జన్మ, సావు ధన్యమైనట్టే! గదే నాకు కోట్ల ఆస్తితోని సమానం. వాళ్లతాన దీన్, దౌలత్ రెండు నిండుగ ఉన్నయి గదా.. అవిటిని మాకు పంచియ్యకుంట వాళ్ల దగ్గర్నే ఉంచుకోనియిర్రి. కాకపోతే నాది ఇంకొక కోరికేందంటే.. నాన్న సమాధిని మాకు సూపించాలె. ఆయన సమాధి మీద ఇన్ని పూలేసి మా జన్మగూడ ధన్యమైందనుకుంటం. అట్లనే ఈ తీర్పును మసీదుల మైకుల్ల కెల్లి ఈ నల్గొండ మొత్తం ఇనిపించాలె'' అన్నాడు ఉబికొస్తున్న దుఃఖాన్ని పంటి బిగువున అదుముతూ.

ఖలీల్ అభ్యర్థనకు ఫీల్‌ఖానా జనమంతా పచ్చజెండా ఊపారు. కనీజ్ వాళ్లు మాత్రం తీవ్ర అవమానం జరిగిందన్నట్టు అసలు ఇంట్లోంచి బయటికి రాకుండా ముఖం చాటేశారు.

* * *

'రంజాన్, బక్రీద్ పండగలకు నాన్న సమాధి మీద కాసిన్ని పూలు వేసి.. దరూద్ చదువుతానా!?' అన్న తన ఎన్నో ఏళ్ల కల ఇవాళ నెరవేరుతున్నది!

రాళ్లు ఊడిపోయి ఉన్న నాన్న సమాధి మీద పడి బోరున విలపిస్తున్నారు అన్నదమ్ములు.

పూల నక్షత్రాలను గుమ్మరించి తమ కన్నీటి అత్తరును ఆ సమాధిపై ధారపోశారు.

తండ్రి గుండెల మీద పసివాడిలా సమాధిపై పడి గుక్కపట్టినట్టే ఏడ్చేస్తున్నాడు ఖలీల్. అతని దుఃఖాన్ని ఆపడం ఎవరితరమూ కావడంలేదు.

చాలా సేపటికి తేరుకొని సమాధి పైనుంచి రెండు దోసిళ్ల మట్టిని తీసి సంచిలో వేసుకున్నాడు.

''ఆ మట్టిని తీస్కపోయి ఏం జేస్తవయ్యా?'' అక్కడున్న వారిలోంచి ప్రశ్న.

''అమ్మ సమాధి మీద వోస్త. అట్లనన్న అమ్మ.. నాన్న పక్కకు సమాధి అయిన్నని అనుకుంటదేమో. ఇది నా సెల్ఫ్ సాటిస్‌ఫాక్షన్ కోసమే!'' అన్నాడు.

మనిషి మనుగడకు శాశ్వత చిరునామా అయిన ఈ మట్టిలోనే వాళ్లను శాశ్వతంగా మమేకం చేస్తున్నానన్న ఆత్మసంతృప్తి అతని గుండెల నిండా.

* * *

మర్నాడు నల్గొండలోని మసీదుల మైకులన్నింట్లోంచి అందరికీ తెలిసేలా ఆ కోర్టు తీర్పును చదివి వినిపించారు.

''అన్యాయమైన బతుకు అట్లా చరిత్రల సమాధి కావొద్దు. అది ఎప్పటికైనా బయటికచ్చి కొన ఊపిరితోనైనా కనీసం గొంతు విప్పాలె. న్యాయం కోసం పోరాడాలె. పదిమందికి తెల్వాలె. అట్లా తెలిస్తేనైనా ఇంకెవరైనా అసుంటి అన్యాయం ఆడోళ్లకు చెయ్యరు'' ఖలీల్ మనసులోని మాట నిజమైంది.

అవే మైకుల్లో..

''మేరా బాప్ ఖయ్యూం'' అని తన వతన్, మాయిముంత అయిన నల్గొండ మట్టిలోని పరమాణువులకు, దిగంతాల్లోని నాన్న ఆత్మ చెవులకు సైతం వినిపించేలా బిగ్గరగా అరిచాడు. అలా అరవగానే అతని ఎదలో పెను తుఫాను తగ్గాక తొలగిన మబ్బుల చాటునుంచి నీలాకాశపు నిర్మలత్వం ఆవరించింది.

అతని శరీరంలోని అణువణువూ అస్తిత్వపు సొబగులు అద్దుకొని విజయగర్వంతో ఉప్పొంగసాగింది.

నా దేశం, నా మాతృభూమి అని అన్నంత గర్వంగా.. 'నా పితృభూమి' అని ఆ నల్గొండ నేల మీద సాష్టాంగ పడి గాఢంగా ముద్దుపెట్టాడు. ■

* * *

**పుల్సిరాత్ కా రాస్తా = నరకపు దారి**
**దీన్ = ఇస్లాం సంబంధిత**
**ఘరేలూ మస్లా = ఇంటి వ్యవహారం**
**మాలూమాత్ = ఎరుక**
**సూరాలు = స్తోత్రాలు**
**ఎర్ర గోర్జాలు = గురువింద గింజలు**

## హుమాయూన్ సంఘీర్



రచయిత జీవితంలో ఎదురైన ఒక పెద్ద సంఘర్షణకు అక్షరరూపమే.. 'మేరా బాప్ ఖయ్యూం' కథ. కథా రచయితగా, నటుడిగా, దర్శకుడిగా సుపరిచితులు హుమాయూన్ సంఘీర్. కామారెడ్డి జిల్లా గోపాల్‌పేట్ ఈయన స్వస్థలం. ప్రస్తుత నివాసం హైదరాబాద్. ఇప్పటివరకు 60 కథలు, 3 నవలలు రాశారు. కామునికంత, ఇల్లింతపండ్లు, మేరా బాప్ ఖయ్యూం పేరుతో మూడు కథా సంపుటాలను వెలువరించారు. ఇక సినిమారంగంలోనూ సహ రచయితగా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం.. రెండు సినిమాలకు రచనా సహకారంతోపాటు ఒక సినిమాకు కథ, మాటలు అందిస్తున్నారు. రచయితగా.. అనేక కథలు, నవలల పోటీల్లో బహుమతులు అందుకున్నారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీ పీఠం కథల పోటీ–2022లో 'ఇబ్లీస్' కథకు మొదటి బహుమతి దక్కించుకున్నారు. ఉషా పత్రిక – సుజనా ఫౌండేషన్ నవలల పోటీలో 'కళంకం' నవలకు బహుమతి వచ్చింది. 'కామునికంత' పుస్తకానికి కొలకలూరి భాగీరథి పురస్కారం–2023, 'ఇల్లింతపండ్లు' పుస్తకానికి డా.వేదగిరి రాంబాబు కథానిక పురస్కారం–2024 అందుకున్నారు.